టీఎంసీతో ఐసీఐసీఐ జట్టు

హైదరాబాద్, జూన్ 13: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్.. టాటా మెమోరియల్ సెంట్(టీఎంసీ)తో కలిసి విశాఖపట్నంలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటు చేయడానికి ముందు కొచ్చారు. టీఎంసీతో కలిసి నెలకొల్పుతున్న ఈ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. 3.9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1,800 కోట్ల పెట్టుబడితో నెలకొల్పుతున్న ఈ క్యాన్సర్ సెంటర్ కోసం ఐసీఐసీఐ బ్యాంక్ తన వంతుగా రూ.550 కోట్ల నిధులను వెచ్చించనున్నది. ఏటా 3 వేల మంది క్యాన్సర్ రోగులకు చికిత్స అందించడానికి వీలుపడనున్నది.

ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రోల్ మోడల్

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): దేశంలో ఇతర రాష్ట్రాలకు సంక్షేమం, అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పలు దేశాల ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఐబీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్-2025'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట్లో తెలంగాణ ఏర్పాటు అసాధ్యమన్నారని.. అనతి కాలంలోనే రాష్ట్రం అన్‌స్టాపబుల్ అనే స్థాయికి ఎదిగిందని చెప్పారు. రాష్ట్ర జీడీపీ రూ.16.12 లక్షల కోట్లకు చేరిందని.. 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు (9.9%)ను దాటేసిందని వివరించారు. తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు అని.. ఇది దేశ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ అని వెల్లడించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలతో తెలంగాణ పురోగతిని మరో అడుగు ముందుకు తీసుకెళ్లాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. ఆగ్రో ఇన్నోవేషన్, ఏఐ గవర్నెన్స్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, డిజిటల్ ఫార్మింగ్, ఫ్యూచర్ - రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మానుఫ్యాక్చరింగ్, క్లీన్ ఎనర్జీ తదితర అంశాల్లో ప్రపంచ దేశాలతో పని చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

కార్లు కొంటలేరు!

డీలర్ల వద్ద పేరుకుపోయిన రూ.52 వేల కోట్ల ఇన్వెంటరీస్

న్యూఢిల్లీ, జూన్ 13: దేశవ్యాప్తంగా ఆటోమొబైల్ షోరూంలు వెలవెలబోతున్నాయి. వ్యాపారాన్ని భారీగా విస్తరించాలనే ఉద్దేశంతో గల్లికోక షోరూంలను నెలకొల్పిన ఆటోమొబైల్ సంస్థలు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు నిర్వహణ ఖర్చులు అధికమవగా..మరోవైపు అమ్మకాలు పడిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి సంస్థలు. దేశవ్యాప్తంగా ఉన్న కారు డీలర్ల వద్ద రూ.51-52 వేల కోట్ల విలువైన కార్ల ఇన్వెంటరీ పేరుకుపోయింది. రిటైల్‌గా డిమాండ్ పడిపోవడం, మరోవైపు ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేయడంతో కొనేవారు కరువయ్యారు. రోజుకొక కొత్త మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఆటోమొబైల్ దిగ్గజాలు..పాతవాటిని పట్టించుకోవడం లేదు. దీనికోసం డీలర్ల ఎగబడి బుకింగ్ చేసుకొని కొనుగోలుదారులు ఆకట్టుకోవాలని అన్ని విధాలుగా ప్రయత్నిస్తుంటే వారికి మాత్రం నిరాశే ఎదురవుతున్నది. అమ్మకాలను పెంచుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా ఉత్పత్తి చేసి మార్కెట్లోకి విడుదల చేయడం కూడా నిల్వలు పెరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. సంఖ్య పరంగా చూస్తే స్వల్పంగా తగ్గినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం రికార్డు స్థాయికి చేరుకున్నది. దీంతో డీలర్ల ఆందోళన ఆకాశానికి చేరుకున్నది. గతేడాది దీపావళి సమయంలో ఇన్వెంటరీ స్టాక్ 40 నుంచి 45 రోజులు ఉండగా, గత నెలలో ఇది 34-38 రోజులకు తగ్గినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం భారీగా పెరిగింది.

ధరల పెరుగుదలే కారణం

ఆటోమొబైల్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచడంతో కొనుగోళ్లు చేయడానికి కష్టమర్లు జంకుతున్నారు. గడిచిన ఏడాదికాలంలో వాహన ధరలు సుమారుగా 10 శాతం వరకు అధికమయ్యాయి. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేట్ల కారణంగా చూపించి ధరలు పెంచాల్సి వస్తున్నదని సంస్థలు చెబుతున్నాయి. కానీ, ఈ నిర్ణయంతో సామాన్యుడిని కారును దూరం చేస్తున్నాయి. ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ సమాఖ్య(ఫాడా) ఇన్వెంటరీ స్థాయి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తున్నదని, ప్రస్తుతం ఇది 52-53 రోజుల స్థాయిలో ఉన్నదని, దీంతో డీలర్ల నిర్వహణ ఖర్చులు అధికమై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొంది.

రిటైల్ అమ్మకాల దెబ్బ

దేశవ్యాప్తంగా రిటైల్ వాహన అమ్మకాలు అంతకంతకు పడిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగినప్పటికీ, గడిచిన ఎనిమిది నెలల్లో ఇదే కనిష్ఠ స్థాయి కావడం విశేషం. హోల్‌సేల్ అమ్మకాలతో పోలిస్తే రిటైల్ సేల్స్ తగ్గాయని ఫాడా వెల్లడించింది. గత నెలలో 3,02,214 కార్లు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 3.14 శాతం తగ్గాయి. పెరుకుపోతున్న కార్ల నిల్వలపై డీలర్లు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కానీ, మారుతి, హ్యుందాయ్ ఉన్నతాధికారులు మాత్రం ఇన్వెంటరీలు ఆరోగ్యకరమైన స్థాయిలో ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. మారుతి ఇన్వెంటరీ 35 రోజుల స్థాయిలో ఉన్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

కొన్ని మాడళ్లకు డిమాండ్

కొన్ని మాడళ్లను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. కానీ, మరికొన్ని మాడళ్లకు మాత్రం డిమాండ్ అధికంగా ఉన్నది. వీటి కోసం రెండు నుంచి మూడు నెలల వరకు వేచి వుండే కష్టమర్లు ఉన్నారు. మారుతికి చెందిన ఎస్‌యూవీ బ్రెజ్జా, ఎర్టిగా, మహీంద్రా థార్, థార్ రోక్స్, స్కార్పియో-ఎన్ కోసం వేచిచూస్తున్నారు. మరోవైపు, ఇటీవలకాలంలో బ్యాంకులు కీలక వడ్డీరేట్లను తగ్గిస్తుండటం, ఆదాయ పన్ను ప్రయోజనాలతో భవిష్యత్తులో వాహనాలకు డిమాండ్ అధికంగా ఉంటుందని పలువురు ఆటోమొబైల్ దిగ్గజ నిపుణులు అంచనావేస్తున్నారు.

> *తక్కువ ఆదాయం కలిగిన వారికి కేంద్రం శుభవార్తను అందించడం, వరుసగా బ్యాంకులు వాహన రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తుండటంతో ఈ ఏడాది రెండో అర్ధభాగం నాటికి డిమాండ్ అధికంగా ఉండే అవకాశాలున్నాయి.*
> *- కపిల్ సింగ్, నోముర గ్లోబల్ మార్కెట్ రీసర్చ్ హెడ్*

లక్ష దాటిన పుత్తడి

ఒక్కరోజే రూ.2,200 ఎగిసిన తులం విలువ



న్యూఢిల్లీ, జూన్ 13: బంగారం మళ్లీ దూసుకుపోయింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ మిలటరీ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ దేశాల్లో ఒకేసారి అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అతి విలువైన లోహాల ధరలతోపాటు క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి ధర తిరిగి లక్ష రూపాయలు అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల ధర రూ.2,200 ఎగబాకి రూ.1,01,540 గా నమోదైంది. దీంతోపాటు 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,900 ఎగబాకి రూ.1,00,700 పలికింది. గతంలో ఏప్రిల్ 22న బంగారం ధర రూ.1,800 ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600 పలికింది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడం వెండి రికార్డు స్థాయిలో దూసుకుపోయింది. కిలో వెండి రూ.1,100 ఎగబాకి రూ.1,08,100 పలికింది. ఈ నెల 9న కూడా వెండి ధర రూ.1,000 అధికమై చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,08,100కి చేరుకున్న విషయం తెలిసిందే. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఆగస్టు నెల డెలివరీ కాంట్రాక్ట్‌గాను రూ.2,011 ఎగబాకి రూ.1,00,403గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 28.30 డాలర్లు ఎగబాకి 3,415.13 డాలర్లు పలికింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడులను పుత్తడివైపు మళ్లించడం ధర పెరగడానికి కారణమన్నారు.

బీమా సంస్థల చెల్లింపులు రూ.2,400 కోట్లు?

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో అంచనా

అహ్మదాబాద్, జూన్ 13: దేశ చరిత్రలోనే అత్యంత భయానక విమాన ప్రమాదాల్లో ఒకటిగా నిలిచిన గుజరాత్ ఎయిర్ ఇండియా ఫ్లైట్ యాక్సిడెంట్‌లో బీమా క్లెయిముల చెల్లింపులు రూ.2,400 కోట్లదాకా ఉండొచ్చని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు 242 మందితో బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిన సంగతి విదితమే. ఇప్పుడున్న సమాచారం మేరకు మొత్తంగా 265 మంది చనిపోయారు. అలాగే భారీగా ఆస్తి నష్టం కూడా వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఇన్సూరెన్స్ కంపెనీలపై పెను భారమే పడుతున్నది.

టాటా ఏఐజీతోపాటు మరికొన్ని..

కుప్పకూలిన బోయింగ్ 787-8 విమానం విలువ రూ.18వేల కోట్లకుపైగానే ఉన్నది. ఈ ఫ్లైట్‌లోని వారందరికీ టాటా ఏఐజీ, మరికొన్ని సంస్థలు ఇన్సూరెన్స్ అందిస్తున్నాయి. ఏఐజీ వాటా గరిష్ఠంగా 45 శాతం. మిగతా ఇన్సూరర్లలో న్యూ ఇండియా, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, యునైటెడ్, నేషనల్ ఉన్నాయి.

ఆదుకుంటున్న రీఇన్సూరెన్స్

క్లెయిముల భారం నుంచి ఇన్సూరెన్స్ కంపెనీలను రీఇన్సూరెన్స్ సంస్థలే ఆదుకుంటున్నాయిప్పుడు. 242 మంది విమాన ప్రయాణీకులకు బీమా భరోసా కోసం ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలు రీఇన్సూరెన్స్ చేశాయి. లండన్ మార్కెట్‌లోని ఏవోఎన్, విల్లీస్ ఇన్సూరెన్స్ సంస్థలకు రీఇన్సూరెన్స్ కోసం ఇన్సూరెన్స్ సంస్థలు సొమ్ము చెల్లించాయి. దీంతో ప్రాణ, ఆస్తి నష్టాలకు, థర్డ్ పార్టీలకు క్లెయిముల బాధ్యత ఏవోఎన్, విల్లీస్‌లదే అవుతున్నది. కాగా, ఈ ప్రమాదం నేపథ్యంలో మృతులకు ఒక్కొక్కరికీ రూ.1.8 కోట్లు రావచ్చని చెప్తున్నారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.18 లక్షలు రావచ్చు. విమాన ప్రమాదంలో బీమా సాయం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. వీఐపీలు, ఆయా దేశస్తులు, తలసరి ఆదాయం, హోదా, జీతాలు ప్రభావితం చేస్తాయి.

మార్కెట్లకు క్రూడ్ దెబ్బ

ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలతో ప్రభావితం

సెన్సెక్స్ 573, నిఫ్టీ 170 పాయింట్లు డౌన్ • 2 రోజుల్లో రూ.8.35 లక్షల కోట్ల సంపద ఔట్

ముంబై, జూన్ 13: ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, పెరిగిన బ్రెంట్ ముడి చమురు ధరలు.. దేశీయ స్టాక్ మార్కెట్లను శుక్రవారం భారీ నష్టాల్లోకి నెట్టాయి. ఉదయం ఆరంభం నుంచే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న సూచీలు.. ఏ దశలోనూ లాభాల్లోకి రాలేకపోయాయి. ఈ క్రమంలోనే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 573.38 పాయింట్లు లేదా 0.70 శాతం కోల్పోయి 81,118.60 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 169.60 పాయింట్లు లేదా 0.68 శాతం దిగజారి 24,718.60 వద్ద స్థిరపడింది. అయితే ఇంట్రా-డేలో సెన్సెక్స్ 1,337.39 పాయింట్లు, నిఫ్టీ 415.20 పాయింట్లు క్షీణించాయి. ఇక గురువారం సైతం సూచీలు నష్టాల్లోనే ముగియగా.. సెన్సెక్స్ 823.16 పాయింట్లు, నిఫ్టీ 253.20 పాయింట్లు పడ్డాయి. స్టాక్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవని భావిస్తున్న ఇన్వెస్టర్లు.. తమ పెట్టుబడులను బంగారం వంటి సురక్షిత పెట్టుబడి సాధానాల్లోకి మళ్లిస్తున్నారని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రిసెర్చ్) ప్రశాంత్ తాప్సీ అంటున్నారు. అలాగే మరి కొద్ది వారాల్లో అమెరికా ప్రతీకార సుంకాలకు దిగవచ్చన్న అంచనాలు, ఇప్పటికే స్టాక్ మార్కెట్లు గరిష్ఠ స్థాయిల్లో ఉండటంతో సూచీలు దిద్దుబాటుకు లోనుకావచ్చన్న అభిప్రాయాన్నీ ఆయన వెలిబుచ్చారు. ఈ ఏడాది లోనే ఎప్పుడూ లేనంతగా బ్యారెల్ ముడి చమురు ధర 76 డాలర్లకు సమీపించడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపర్చింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి విలువ 59 పైసలు పడిపోయింది. చివరకు మారకం విలువ 86.11కి జారుకున్నది.

లక్షల కోట్ల సంపద ఆవిరి

మార్కెట్లు వరుసగా రెండు రోజులు భారీగా నష్టపోవడంతో మదుపరుల సంపద కూడా హరించుకుపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ శుక్రవారం మరో రూ.2.37 లక్షల కోట్లు ఆవిరైపోయింది. దీంతో గురు, శుక్రవారాల్లో రూ.8.35 లక్షల కోట్లు దిగజారినట్టైంది. శుక్రవారం సర్వీసెస్, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఆర్థిక సేవలు, మెటల్, విద్యుత్తు రంగాల సూచీలు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకున్నాయి. షేర్లవారీగా చూస్తే.. అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్, హెచ్‌డీఎఫ్‌సీ, టైటాన్, కొటక్ మహీంద్రా, అల్ట్రాటెక్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.32 శాతం, 0.30 శాతం మేర పడిపోయాయి.

ఢుబ్రిలో కనిపిస్తే కాల్చివేత

- ఓ మత వర్గం అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నది
- అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ

గువాహటి: బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ఢుబ్రి జిల్లాలో రాత్రి సమయంలో కనిపిస్తే కాల్చివేతకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పారు. అలజడి సృష్టించేందుకు ఓ మత వర్గం చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. రాత్రి సమయంలో బయటకు వచ్చినవారిని, రాళ్లు విసిరేవారిని అరెస్ట్ చేస్తామన్నారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరిస్తామని, జిల్లాలోని నేరగాళ్లను అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఢుబ్రి పట్టణంలోని ఓ దేవాలయం వద్ద మాంసపు ముక్కలు కనిపించడంతో కొందరు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీంతో సోమవారం నిషేధాజ్ఞలను విధించారు, మంగళవారం ఆ ఆదేశాలను ఉపసంహరించారు.

అందరూ ఉన్నా.. ఒంటరివాళ్లం

- 54శాతం మంది వయోధికుల్లో ప్రతికూల భావాలు: అధ్యయనం

న్యూఢిల్లీ, జూన్ 13: వృద్ధుల్లో దాదాపు 54 శాతం మంది ప్రతికూల భావాల్ని (నెగిటీవ్ ఫీలింగ్స్).. వృద్ధాప్యంతో ముడిపెడుతున్నారని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. సమాజంలో యువత, వృద్ధుల మధ్య భావోద్వేగ సంబంధం తరుచుగా లోపిస్తున్నదని, రెండు తరాల మధ్య అంతరాలను పూడ్చడానికి తక్షణ చర్యలు అవసరమని 'హెల్ప్ ఏజ్ ఇండియా' నివేదిక పేర్కొన్నది. 10 నగరాల్లో యువత, వృద్ధులపై చేపట్టిన సర్వే నివేదికను జూన్ 15న ప్రపంచ వృద్ధుల వేధింపుల నిరోధక అవగాహన దినోత్సవం సందర్భంగా విడుదల చేసింది. దీని ప్రకారం, 60 ఏండ్లు పైబడిన వృద్ధులు.. కుటుంబంతోపాటు జీవిస్తున్నా తాము ఒంటరి వాళ్లమనే భావన 47 శాతం మంది వ్యక్తం చేశారు. యువత తమ పట్ల గౌరవంగా ఉండటం లేదని, నిశ్శబ్దంగా ఉండిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. తమను పక్కకు పెడుతున్నారని మదురైకి చెందిన ఓ వృద్ధుడు చెప్పుకొచ్చాడు. ఒకే కుటుంబంగా ఉంటున్నా.. ఒంటరిగా భోజనం చేస్తున్నానని కాన్పూర్‌కు చెందిన ఓ వ్యక్తి వాపోయాడు. ముంబై, ఢిల్లీ నగరాలతో పోల్చితే కాన్పూర్, మదురై లాంటి నాన్-మెట్రో నగరాల్లో ఉమ్మడి కుటుంబాలు బలమైన బంధాలన్ని పెంపొందించాయని తేలింది. వృద్ధుల్లో రెండింట మూడొంతుల మంది డిజిటల్ టూల్స్ పట్ల గందరగోళానికి గురవుతున్నారు. 2050 నాటికి భారతదేశంలో వృద్ధుల జనాభా 19 శాతానికి చేరుకుంటుందని అంచనా.

అపరిచిత మహిళను చంపి..!

- ఆ శవాన్ని తగలబెట్టి సోనమ్‌గా నమ్మించేందుకు కుట్ర
- రఘువంశీ హత్య కేసులో వెలుగులోకి కొత్త విషయాలు

షిల్లాంగ్, జూన్ 13: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వ్యాపారి రాజా రఘువంశీ హత్య కేసు దర్యాప్తులో మరో కొత్త కోణం బయటపడింది. మరో గుర్తు తెలియని మహిళను హత్య చేసి, ఆమె శవాన్ని తగలబెట్టి, అది కనిపించకుండా పోయిన రఘువంశీ భార్య సోనమ్ మృతదేహంగా నమ్మించేందుకు హంతకులు కుట్ర పన్నారని మేఘాలయ పోలీసులు వెల్లడించారు. అలా చేయడం ద్వారా సోనమ్ అజ్ఞాతంలోనే కొంతకాలం ఉండాలన్నది వారి పథకమని పోలీసులు చెప్పారు. ఈ మొత్తం కుట్ర వెనుక సోనమ్ ప్రియుడు రాజ్ కుష్వాహా ప్రధాన కుట్రదారుడని, అతనికి సహకరించిన సోనమ్ సహా కుట్రదారుగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. రఘువంశీ హత్యకు ఇండోర్‌లో ఫిబ్రవరిలో పథక రచన జరిగింది. రఘువంశీని హత్య చేసిన తర్వాత సోనమ్ ఎలా అదృశ్యం కావాలో పరిపరి విధాలుగా హంతకులు ఆలోచించారు. సోనమ్ నదిలో కొట్టుకుపోయిందని నమ్మించాలని ఓ పథకం వేశారు. ఎవరో ఓ అపరిచిత మహిళను హత్య చేసి, శవాన్ని తగలబెట్టి అది సోనమ్ శవమని నమించాలని మరో పథకం వేశారు. అయితే ఈ రెండు పథకాలలో ఏవీ ఫలించలేదని పోలీసులు తెలిపారు. మే 19న కొత్తగా పెళ్లయిన సోనమ్, రాజా రఘువంశీ జంట అస్సాంకు రావడానికి చాలా రోజుల ముందే హంతకుల ముఠా గువాహటి చేరుకుంది. తాము అనుకున్న పథకాలు ఏవో కారణాలతో కార్యరూపం దాల్చకపోవడంతో షిల్లాంగ్, సోహ్రా వెళ్లాలని సోనమ్ అప్పటికప్పుడు ఆలోచన చేసింది. అనుకున్న విధంగానే వీరంతా నాన్‌గ్రియాత్ వద్ద కలుసుకున్నారు. వీసాడాంగ్ వాటర్ ఫాల్స్ వద్దకు విడివిడిగా అంతా కలిసే బయల్దేరారు. హంతకులు ముగ్గురూ అస్సాంలో కొన్న కొడవలితో సోనమ్ సమక్షంలోనే మే 23వ తేదీ మధ్యాహ్నం 2-2.18 గంటల మధ్య రఘువంశీని నరికి చంపారు. ఆ తర్వాత రాజా మృతదేహాన్ని లోయలో పడేశారు. ఆకాశ్ షర్టుకు రక్తపు మరకలు అంటుకోవడంతో వాటిని దాచేందుకు సోనమ్ తాను ధరించిన రెయిన్ కోటు అతనికి ఇచ్చింది. అంతేగాక తాము అద్దెకు తీసుకున్న ద్విచక్ర వాహనాన్ని కూడా సోనమ్ అక్కడే వదిలేసింది. సోనమ్ కనిపించకుండా పోయిందని అందరూ భావిస్తున్న సమయంలో ఆ ప్రదేశంలో లభించిన రెయిన్‌కోట్, టూవీలర్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాల్‌కు రాజా బురఖా ఇచ్చాడని, దాన్ని రాజ్ సోనమ్‌కు అందచేశాడని పోలీసులు చెప్పారు. బురఖా ధరించి సోనమ్ పోలీసు బజార్‌కు వెళ్లి అక్కడి నుంచి గువాహటికి ట్యాక్సీలో వెళ్లిందని వారు చెప్పారు. గువాహటి నుంచి బస్సులో పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి చేరుకున్న సోనమ్ పాట్నా, ఆరాకు బస్సులలో వెళ్లినట్లు వారు చెప్పారు. రైలులో లక్నో చేరుకున్న సోనమ్ అక్కడి నుంచి ఇండోర్‌కు బస్సులో వెళ్లినట్లు వారు తెలిపారు. ఈ మధ్యలో, ఓ టూర్ గైడ్‌ని మేఘాలయ మీడియా ఇంటర్వ్యూ చేయగా సోనమ్, రాజా, మరో ముగ్గురు వ్యక్తులను తాను చూసినట్లు తెలిపాడు. రాజా హత్య తర్వాత ఇండోర్‌లో సోనమ్‌ను కలుసుకున్న రాజ్ అక్కడి నుంచి సిలిగురి లేదా మరో ప్రదేశానికి వెళ్లి తనను ఎవరో కిడ్నాప్ చేసినట్లు నాటకమాడమని సోనమ్‌కు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. జూన్ 8న సోనమ్ ఇండోర్ నుంచి బయల్దేరగా మేఘాలయ నుంచి రెండు పోలీసు బృందాలు ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు సివిల్ డ్రెస్‌లో చేరుకున్నాయి. యూపీలో ఆకాశ్‌ను పోలీసులు అరెస్టు చేయగా వెంటనే సోనమ్‌కు ఫోన్ చేసిన రాజ్ తాను కిడ్నాపింగ్ గ్యాంగ్ నుంచి తప్పించుకుని వచ్చినట్లు నాటకమాడమని సోనమ్‌కు చెప్పాడు. ఆ ప్రకారమే సోనమ్ ఘాజీపూర్‌లో బయటకు వచ్చింది. మారుమూల ప్రదేశంలో రాజాను హత్య చేసి పడేసినందున శవం దొరకడానికి కనీసం రెండు, మూడు నెలలు పడుతుందని హంతకులు భావించారని, అందుకే సోనమ్ చేత బాధితురాలిగా నాటకం ఆడించారని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం నిందితుల వాంగ్మూలాలు నమోదు చేస్తున్నామని, వారిని ప్రశ్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. మరిన్ని సాక్ష్యాధారాలను సేకరించి క్రైమ్ సీన్‌ను రికన్‌స్ట్రక్ట్ చేస్తామని వారు చెప్పారు. కాగా రఘువంశీని చంపేందుకు హంతకులు మూడు విఫల ప్రయత్నాలు చేశారని, నాలుగో ప్రయత్నంలో అతడిని హత్య చేశారని పోలీసులు తెలిపారు.

నివ్వెరపరిచిన యాడ్!

న్యూఢిల్లీ: ఏవియేషన్ అకాడమీ కిడ్జానియా ఇండియా విడుదల చేసిన పత్రికా ప్రకటన, అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదం మధ్య పోలికలు ఉన్నాయి. ఫాదర్స్ డే వీకెండ్ ఈవెంట్‌ను ప్రమోట్ చేయడం కోసం గురువారం ఉదయం 'మిడ్-డే' పత్రిక తొలి పేజీలో ఈ ప్రకటనను ముద్రించారు. అదే రోజు మధ్యాహ్నం ఎయిరిండియా ఏఐ-171 విమానం అహ్మదాబాద్‌లోని ఓ వైద్య కళాశాల హాస్టల్ భవనంపై కూలిపోయింది. కిడ్జానియా ప్రకటనలో కూడా ఎయిరిండియా విమానం కిడ్జానియా భవనం నుంచి దూసుకొస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ సారూప్యత ఉండటంతో చాలా మంది అవాక్కయ్యారు. దీనిపై కిడ్జానియా స్పందించింది. ఎయిరిండియాతో గత ఏడాది కుదుర్చుకున్న అవగాహన మేరకు ఈ డిజైన్‌ను రూపొందించినట్లు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా తమ సెంటర్లలో ఇటువంటి డిజైన్లు ఉంటాయని, ఆయా దేశాల్లోని ప్రముఖ ఎయిర్‌లైన్స్‌తో తాము అవగాహన కుదుర్చుకుంటామని చెప్పింది. విమాన ప్రమాదంలో మరణించినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపింది. తాము ఈ ప్రకటనను ఈ ప్రమాదం జరగడానికి ముందే జారీ చేశామని వివరించింది. ఈ విజువల్ ప్రదర్శనకు విరామం ఇస్తామని పేర్కొంది. కిడ్జానియా ఏవియేషన్ అకాడమీ సెంటర్లు ఢిల్లీ, ముంబై, నోయిడాలో ఉన్నాయి. వీటిలో 4-16 సంవత్సరాల మధ్య వయసుగల బాలల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

కొత్తింటి కల నెరవేరకుండానే..

తిరువనంతపురం: కేరళలోని పతనంతిట్ట జిల్లా తిరువల్లకు చెందిన రంజిత గోపకుమార్ (39) ఇద్దరు పిల్లల తల్లి. బ్రిటన్‌లో నర్సుగా పనిచేస్తున్న ఆమె.. గతంలో కేరళ ప్రభుత్వ ఆరోగ్య సేవల విభాగంలో పనిచేశారు. మెరుగైన అవకాశాల కోసం ఆ ఉద్యోగానికి సెలవు పెట్టి విదేశానికి వెళ్లిన రంజిత.. కొంత కాలం పాటు ఒమన్‌లోని సలాలాలో పనిచేశారు. ఆ తర్వాత బ్రిటన్‌కు వెళ్లి నర్సుగా పనిచేస్తున్న ఆమె ఎన్నో ఆశలతో నాలుగు రోజుల క్రితమే భారత్‌కు తిరిగొచ్చారు. తిరువల్లలో కొత్త ఇంటిని నిర్మించుకుంటున్న రంజిత.. తన పిల్లలను, తల్లిని ఆ ఇంటిలోకి తరలించి వారికి సురక్షితమైన, స్థిరమైన జీవితాన్ని అందించాలని కలలుగన్నారు. వారితో కలిసి హాయిగా జీవించేందుకు మళ్లీ కేరళలో పాత ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా బ్రిటన్‌లో ఉద్యోగాన్ని మానేసి, సంబంధిత పత్రాలను తీసుకునేందుకు సంతోషంగా బయలుదేరిన రంజితను అకాల మృత్యువు కబళించింది. గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఆమె మృతి చెందారు. దీంతో రంజిత తల్లి తులసీకుట్టియమ్మ, పిల్లలు ఇందుచూడన్ (15), ఇతిక (12)తోపాటు ఇద్దరు సోదరులు కన్నీటి సాగరంలో మునిగిపోయారు.

అదే ఆఖరి వీడ్కోలనుకోలేదు!

బైబై అంటూ వీడ్కో